ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

ఆదివారం 2 నవంబరు 2025

ఇలాగైతే పాలనెలా...!

- పురపాలికలో కుర్చీలన్నీ ఖాళీ..! ● సెక్షన్ హెడ్స్ లేక ఇబ్బందులు

- ఉన్న వారికే ఇన్‌చార్జ్ బాధ్యతలు
- అభివృద్ధి పనులకు ఆటంకం
- శానిటరీ, పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తం



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అది పేరుకే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ. త్వరలో ఆ పరిధిని కూడా దాటి కార్పొరేషన్ దిశగా అడుగులు పడుతున్నాయి. కానీ ఆ స్థాయిలో పాలన ముందుకు సాగడం లేదు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలతో పోలిస్తే మదనపల్లె మున్సిపాలిటీ చాలా కీలకమైంది. కానీ ప్రజలకు మాత్రం ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. దానికి కారణం అక్కడి కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటమే. సెక్షన్ హెడ్స్‌తో పాటు మిగిలిన విభాగాల పోస్టులదీ ఇదే పరిస్థితి. ఉద్యోగులంతా బదిలీ కావడం, డిప్యుటేషన్లపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరికొందరు పదవీ విరమణ పొందడం.. వారి స్థానాల్లో కొత్తవారిని నియమించకపోవడం, కొందరు మదనపల్లె అంటేనే రాకపోవడం, తదితర కారణాలతో కీ రోల్ పోస్టులతో పాటు మిగిలిన జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో ఇప్పటికే ఉన్న వారికి రెండుకు మించి పోస్టుల బాధ్యతలు అప్పగించి పాలన సాగిస్తున్నారు. దీంతో పని ఒత్తిడి, ఉన్న ఖాళీలు ఏళ్లు, నెలల తరబడి భర్తీ చేయకపోవడంతో పాలన గాడి తప్పడమే కాదు.. ఆయా విభాగాల పర్యవేక్షణ లేక ఎక్కడి పనులు అక్కడే ఉంటున్నాయి.

మేనేజర్ పోస్టూ ఖాళీనే...

ఇక్కడి మున్సిపాలిటీలో మేనేజర్‌గా ఉన్న అహ్మాదున్నిసా మూడేళ్ల క్రితం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం బి.కొత్తకోట నగర పంచాయతీ నుంచి ఆరునెలల క్రితం పి.ఆర్.మనోహర్ మేనేజర్‌గా ఇక్కడికి వచ్చారు. తిరిగి ఆయన ఇటీవల పదోన్నతిపై పీకేఎం ఉడా కార్యదర్శిగా వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. కమిషనర్ తర్వాత పాలన అంతా మేనేజర్ చేతిలోనే ఉంటుంది. పరిపాలన, అడ్మినిస్ట్రేషన్ మొత్తాన్ని నడిపించే మేనేజర్ పోస్టు కూడా ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటం పరిపాలనా తీరును ప్రశ్నిస్తోంది. అలాగే పురపాలికలో కీలకమైన రెవెన్యూ విభాగం, మున్సిపాలిటీకి ఆర్థిక వనరులు సమకూర్చే ఆర్‌వో పోస్టు ఆరు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడున్న ఆర్‌వో విజయ్‌కుమార్ పదవీ విరమణ చేయగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుమల ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. మున్సిపాలిటీలో ట్యాక్సుల వసూళ్ల నుంచి కొత్తగా నిర్మించిన నివాసాలకు పన్నుల విధించడం వరకూ ఆర్‌వో స్థాయిలో జరగాలి. కానీ ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో అన్ని పనులూ ఉన్న ఇద్దరు ఆర్ఐలే చూసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా పట్టణంలో దినసరి మార్కెట్, వారపుసంత వసూళ్ల ప్రక్రియ వివిధ కారణాలతో ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. వీటికి వేలంపాటలు నిర్వహించినా కౌన్సిల్ సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం, కాంట్రాక్టర్లు లేకున్నా ప్రధాన ఆదాయ వనరైన గేటు వసూళ్లను రెవెన్యూ అధికారులు, సిబ్బందే వసూలు చేయాల్సి ఉంది. కానీ ఆ స్థాయిలో వసూలు చేయలేక చేతులెత్తేశారు. వీటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది. ఇక మున్సిపాలిటీకి చెందిన షాపు రూముల అద్దెలు వసూలు చేయడం, ఖాళీగా ఉన్న గదులకు ఎప్పటికప్పుడు వేలం పాటలు నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే ప్రక్రియ చేపట్టడంలో విఫలమయ్యారు. మున్సిపల్ బకాయిలతో పాటు వంద నుంచి 150 మున్సిపల్ గదులు ఖాళీగా ఉన్నాయి.

టౌన్ ప్లానింగ్‌లోనూ...

పట్టణ రూపురేఖలు మార్చే పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో), టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్), బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ అంచెలంచెలుగా రెండేళ్ల నుంచి ఆరు నెలల వరకూ ఖాళీగా ఉన్నాయి. ఇక ఇద్దరు సర్వేయర్లు ఉండగా, పూర్ణచంద్ ఏడాదిన్నర క్రితం వాల్మీకిపురానికి బదిలీపై వెళ్లగా, ఉన్న ఒకానొక సర్వేయర్ రెడ్డెమ్మ చూస్తున్నారు. ఇక్కడికి కలికిరి నుంచి సర్వేయర్ రెడ్డెప్పను ఇన్‌చార్జ్‌గా నియమించినా వారానికొకసారి చుట్టపుచూపుగా వచ్చి వెళుతున్నారు. ఫలితంగా పట్టణంలో ఆక్రమణలతో పాటు అక్రమ నిర్మాణాలు అధికమయ్యాయి. ప్రధాన రహదారులే కాదు పట్టణంలోని చిన్నపాటి లింకు రోడ్లు, ఫుట్‌పాత్‌లు సైతం ఆక్రమణలకు గురవుతున్నా అడిగే వారే లేరు. ప్రధానంగా సీటీఎం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు బాహుదా నుంచి బాలాజీనగర్ మున్సిపల్ బోర్డు వరకూ యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. వీటిని నియంత్రించడంలో టౌన్ ప్లానింగ్ విభాగం చేతులెత్తేసిందనే చెప్పాలి. ఇక అడ్వర్‌టైజ్‌మెంట్‌లో భాగమైన హోర్డింగులు, బ్యానర్లు, కటౌట్లు పట్టణంలో ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందితో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయి. మున్సిపాలిటీకి పైసా పన్ను చెల్లించకుండా రాజకీయ నాయకులు, వ్యాపారులు, ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రకటనల రూపంలో మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోతోంది.

శానిటేషన్‌లో...

పట్టణ ప్రజల ఆరోగ్యానితో ముడిపడి ఉన్న శానిటేషన్ అస్తవ్యస్తంగా తయారైంది. వీటి పర్యవేక్షణ శానిటరీ సూపర్‌వైజర్ లేరు. ఈ పోస్టు అయిదేళ్లుగా ఖాళీగా ఉంది. ఉన్న ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లే చూస్తున్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చాక శానిటరీపై మున్సిపల్ పర్యవేక్షణ తగ్గిందని చెబుతున్నారు. శానిటరీ సెక్రటరీ ఎక్కడుంటారో, ఎక్కడ పనిచేస్తున్నారో ఎవరికీ తెలియదు. కమిషనర్‌తో సహా సచివాలయ ఉద్యోగులు ఎవరి మాట వినడం లేదనే విమర్శలు ఉన్నాయి. 112 మంది ఉన్న రెగ్యులర్ వర్కర్లలో ప్రస్తుతం 80 మందికి చేరారు. పట్టణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజనీరింగ్ విభాగం పరిస్థితి కూడా దాదాపు ఇంతే. ముగ్గురు ఏఈలు ఉండాల్సి ఉండగా ఒకరే ఉన్నారు. డీఈలు మాత్రం ఇద్దరూ ఉన్నాయి. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, తాగునీటి సరఫరా, బోర్లు, పైపులైన్లు, మరమ్మతులు చేపట్టాల్సిన పనులు చాలా వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. ఇక పార్కులు, కంపోస్టుయార్డు నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే మిగిలింది. పనిచేసే కార్మికుల తీవ్ర కొరత, పర్యవేక్షణ లేమి, నిధులు లేకపోవడం, తదితర కారణాలతో కీలకమైన, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచి పెట్టే పార్కులు, కాలుష్య నివారణలో భాగమైన కంపోస్టుయార్డులు దీనావస్థకు చేరుకున్నాయి.

పాలనకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



మున్సిపాలిటీలో ఉద్యోగుల కొరత ఎక్కువగా ఉంది. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, శానిటరీ విభాగంలో సమస్య ఉంది. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నాం. అయితే పాలనకు ఎక్కడా ఇబ్బంది లేకుండా ఉన్న వారితోనే రెగ్యులర్ పనులు చేయిస్తున్నాం.

-కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చిన్నమండెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామం రాజీవ్ కాలనీలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వారికి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వితంతు, వృద్ధాప్య పింఛన్ల పంపిణీని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పింఛన్ అందుతుందా, ఏ రోజు అందుతోంది. ఎన్ని గంటల సమయంలో ఇంటికి వచ్చి ఇస్తున్నారని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

'ఏఎన్‌ఎం- విస్తా'తో సమర్థవంతమైన పాలన

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమర్థవంతమైన పరిపాలన కోసం జిల్లాకు ప్రత్యేకంగా రూపొందించబడిన ఏఎన్‌ఎం-విస్తా మొబైల్ అప్లికేషన్‌ను అధికారులందరూ వినియోగించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలకు, జిల్లా పరిపాలనపై రూపొందించబడిన ఏఎన్‌ఎం విస్తా మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్లికేషన్ వినియోగించుకునే విధానాన్ని వివరించారు. ఈ మొబైల్ అప్లికేషన్ ద్వారా జిల్లా అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు, తహసీల్దార్‌లకు, ఎంపీడీవోలకు నిర్దేశించబడిన దరఖాస్తులు, వాటి స్టేటస్ చూసుకోవచ్చని, దీని ద్వారా పరిపాలన సమర్థవంతంగా సజావుగా జరుగుతుందని తెలిపారు.

రైల్వేట్రాక్‌లపై మృత్యుఘోష 7

దేశ సమైక్యత, సంస్కృతి కాపాడాలి

- వేమన బోధనలు మార్గదర్శకాలు ● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కార్యక్రమానికి హాజరైన వారు, మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సంస్కృతి, విలువలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు. రెండు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని అన్నమయ్య సెనేట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో ముచ్చటించిన వెంకయ్యానాయుడు భారత ఔన్నత్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొప్పదనం, తెలుగుభాష తీయదనం, కడప జిల్లా కళా-సాహిత్య విశిష్టతలను వివరించారు. మన మహనీయులు, ముఖ్యంగా నవ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులుగా మారాలని, వ్యక్తిత్వ వికాసానికి యోగివేమన బోధనలు మార్గదర్శకాలని చెప్పారు. సరళమైన పదాలతో పద్యాల రూపంలో వేమన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. గురువులను గౌరవించాలని, పెద్దల పట్ల వినయం ప్రదర్శించాలని, తోటివారితో సఖ్యతతో మెలగాలని సూచించారు. అలాగే యువత సృజనాత్మక శక్తిని ఎప్పటికీ కోల్పోకూడదని, టెక్నాలజీని పరిమితస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశ బలోపేతానికి యువ త కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యతో పాటు యోగా, క్రీడలు, కళలు, సాహి త్యం, మానసిక వికాసం మీద దృష్టిపె ట్టాలన్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని హితవుపలికారు. మన కట్టు బొట్టు, సంస్కృతి, సంప్రదాయాలు, వేషాభాషలు మన అస్తిత్వానికి ప్రతీకలని.. వాటిని కాపాడుకోవాలని సూచించారు. మాటతీరు, మర్యాద, పెద్దలంటే గౌరవం, ఆరోగ్యకరమైన భారతీయ ఆహారపు అలవాట్లు మన సంస్కృతిలో అంతర్భాగమని గుర్తుచేశారు. కుటుం బ వ్యవస్థను బలపరచుకోవాలని, తల్లిదండ్రులతో సమయాన్ని గడపాలని, ప్రేమ, అనురాగ బంధాలను పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. సమాజంలో స్నేహ భావం పెంపొందించాలని, ఈర్ష్య-ద్వేషాలను పక్కనపెట్టి ఆప్యాయతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరు కూరి, వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ పద్మ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీఓ జాన్ ఇర్విన్, యూనివర్సిటీ ఆచార్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేష్‌నాయుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు శశిభూషణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

దేవునికడప శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి

కడప కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప్ దర్శించారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి శ్రీవారిని దర్శించుకుని.. కార్తీకమాస దీపాలను వెలిగించి ప్రత్యే క పూజలు నిర్వహించారు. అనంతరం సమీప దేవుని కడప శివాలయంలో పరమశివుని దర్శించుకుని పూజలు చేశారు. న్యాయమూర్తి వెంట ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి రమేష్‌కుమార్, ఇతర జడ్జిలు ప్రవీణ్‌కుమార్, ప్రత్యూష, ఈశ్వర్ దేవాంగ్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ శాఖ భవన నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కర్నూలు పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయాల సమీపంలో త్వరలో నిర్మించనున్న పోస్టల్ శాఖ శాశ్వత భవన నిర్మాణ స్థలాన్ని కర్నూలు పోస్టు మాస్టర్ ఆఫ్ జనరల్ ఉపేంద్ర, ఉమ్మడి జిల్లాల ఏఎస్పీ రెడ్డిబాషలు పోస్టల్ సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖ కార్యాలయం కోసం స్థలం కేటాయించినప్పటికీ ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. దీంతో అద్దె భవనాల్లో కార్యకలాపాలు చేయాల్సి వస్తోందని, అధికారులు, సిబ్బందితో వివిధ రకాల సేవల కోసం వచ్చే ప్రజలు కూడా అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. అత్యాధునికంగా అన్ని సేవలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణం చేపడుతున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో రాయచోటి పోస్టల్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆ పశు వైద్యశాలకు 70 వసంతాలు

- విశ్రాంత వైద్యులకు సన్మానం


వాల్మీకిపురం పశువైద్యశాల 70 వసంతాల వేడుకల్లో వైద్యులు, సిబ్బంది

వాల్మీకిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాల 70 వసంతాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. 1955వ సంవత్సరంలో మండలంలోని ఓబులంపల్లె వాస్తవ్యులు, అప్పటి చీఫ్ సెక్రటరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఓ.పుల్లారెడ్డి చేతుల మీదుగా పశువైద్యశాల ప్రారంభించారు. 1971 నుంచి 1996 వరకు ఇదే ప్రాంగణంలో చీఫ్ సూపర్‌వైజర్ యూనిట్ కూడా ప్రత్యేక వైద్యుడి ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పట్లో నెల్లూరు జోడీపీ జాతికి చెందిన గొర్రెల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పొట్టేళ్ల పెంపకం కూడా చేపట్టారు. వాల్మీకిపురం, నిమ్మనపల్లె, గుర్రంకొండ, పెద్దమండ్యం గ్రామాలలోని గొర్రెల పెంపకందారులకు ఆరోగ్యకరమైన పొట్టేళ్లను పంపిణీ చేసి జోడీపీ జాతి అభివృద్ధికి కృషి చేశారు. 1985 సంవత్సరంలో ప్రాంతీయ పశు వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి సహాయ సంచాలకులను నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడుగురు సహాయ సంచాలకులుగా విధులు నిర్వహించారు. సంకరజాతి ఆవుల అభివృద్ధి, పశుగ్రాసాల ప్రాముఖ్యత తదితర అంశాలపై పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పథకాలను అందజేస్తూ ఎంతగానో తోడ్పాటును అందించారు. ఆస్పత్రి ప్రారంభమై 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా శనివారం వైద్యశాలను అలంకరించి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత పశువైద్యాధికారులు లక్ష్మీరెడ్డి, హసన్‌సాహెబ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము పనిచేసిన నాటి రోజులు, అనుభూతులను స్థానిక వైద్యులతో పంచుకుని సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో మదనపల్లె డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులునాయుడు, ఏడీఏ విశ్వేశ్వరరెడ్డి, వివిధ మండలాల పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసులోకి ఆర్టీపీపీ యూనిట్లు


ఆర్టీపీపీ

ఎర్రగుంట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో రెండు యూనిట్లను శనివారం సర్వీసులోకి తీసుకున్నారు. మొంథా తుఫాను కారణంగా భారీగా పడిపోయిన విద్యుత్ డిమాండ్‌తో ఆర్టీపీపీలోని దాదాపు అన్ని యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేశారు. అయితే మళ్లీ విద్యుత్ డిమాండ్ పెరగడంతో శనివారం ఉదయం 600 మెగావాట్ల సామర్థ్యంగల 6వ యూనిట్‌ను లైటప్ చేయడంతో సాయంత్రం 7గంటలకు 90మెగా వాట్లతో నడుస్తోంది. అలాగే 2వ యూనిట్‌ను కూడా సాయంత్రం లైటప్ చేయడంతో రాత్రికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి కొనసాగిస్తుందని సీఈ వాసుదేవరావు తెలిపారు. 1వ యూనిట్ 120 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తోంది.



టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి

● ఫ్యాప్టో నేతల డిమాండ్

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని శనివారం అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో నాయకులు కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌లకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబిర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా బోధనలో ఉన్న ఉపాధ్యాయులు ఇటీవల వచ్చిన సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) రాయాలని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి చట్టపరమైన మార్పులు చేయడం ద్వారా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఇప్పటికే దీని కోసం చట్టపరమైన చర్యలు ప్రారంభించిందన్నారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనర్ గఫార్‌ఖాన్, జిల్లా కో చైర్మెన్లు శివారెడ్డి, సిబాతుర్‌రెహమాన్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ హరిబాబు, జిల్లా కోశాధికారి జాఫరుడ్డీన్, రాష్ట్ర బాధ్యులు రవీంద్రారెడ్డి, నాయకులు అంజద్‌బాషా, ప్రదీప్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రభుత్వ సంస్థల పనితీరుపై అవగాహన అవసరం

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలైన పంచాయ తీలు, మండల పరిషత్తు పని తీరును విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు టి.సునీత అన్నారు. జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు దేశానికి పట్టుకొమ్మలని, వాటి నిర్మాణం, విధుల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ప్రతి పల్లెలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, 15వ ఆర్థిక సంఘం నిధులు, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్‌కార్డులు తదితర వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సైన్సు ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల పనితీరు మెరుగుపరచడానికి విద్యార్థుల ఆలోచనలు కూడా ఉపయోగపడతాయన్నారు.

దిన్నెపాడు చెరువుకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నెపాడు పెద్ద చెరువుకు శనివారం నీటి సంఘం చైర్మ న్ మోహన్‌రెడ్డి, టీడీపీ టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ అమ్మవారికి పసుపు, కుంకుమ, కర్పూరాలతో హారతి ఇచ్చి కొబ్బరికాయ సమర్పించి నీళ్లల్లో గంగకు హారతి పట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు సిద్ద వెంకట్రామిరెడ్డి, మండల, రాష్ట్రాల కన్వీనర్ సంకారపు జయరాం, సింగిల్ విండో ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, ధర్మరాజు, బాలే పెద్దరెడ్డియాదవ్, సంజీవరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిసిన మట్లి పెద్దూరు విద్యార్థులు

వీరబల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 30న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాపేటలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లి పెద్దూరు విద్యార్థులు 16 మంది మంచి ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో హర్షవర్ధన్ పదవ తరగతి, పవన్ పదవ తరగతి, రూప 9వ తరగతి, అండర్-14 సాఫ్ట్ రెడ్డిగీత 9వ తరగతి, హేమశ్రీ 8వ తరగతి, సిసింద్రీ 8వ తరగతి, సుబ్రమణ్యం 9వ తరగతి, జగదీశ్ 9 తరగతి, అండర్-14 బేస్‌బాల్ లో రూప, హర్షవర్ధన్, పవన్, అండర్-14 బేస్‌బాల్ ఆర్. విష్ణువర్ధన్, సీ. జగదీశ్, జగదీశ్, సిసింద్రీ, సుబ్రమణ్యం, రెడ్డి గాయత్రి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధాయులు జయన్న తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేసినటువంటి వ్యాయామ సంచాలకులు జగదీశ్వరయ్యను పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమటీ చైర్మెన్ నాగేశ్వర్ అభినందించారు.

రాజంపేటలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా ఆ స్థానానికి పోటీ చేయనున్న ప్రభుత్వ ప్లీడరు యలమంచలి బాలాజీ శనివారం రాజంపేటలో ప్రచారం నిర్వహించారు. రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాల యంలో ఆ సంఘ అధ్యక్షులు హనుంతనాయుడుతో కలిసి రాష్ట్రంలో జరగనున్న బార్ అసోసియేషన్ కౌన్సిల్ ఎన్నికల్లో మనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇందుకు పలువురు సమ్మతించారు. ఈ కార్యక్ర మంలో ఏజీపీ జి.రామచంద్రనాయుడు, టి.లక్ష్మీనారాయణ, సురేంద్ర, ఆనంద్‌కుమార్, నారాయణ, సురేష్‌రాజు, బాలాజీ, శోభారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీని రాజంపేట న్యాయవాదులు సత్కరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర పురం గిరిజన కాలనీకి చెందిన కొండారెడ్డి అం జలి అనే కిడ్నీ బాధితు రాలికి శనివారం బోళాశంకర్ సేవా సమితి సహకారంతో కడపకు చెందిన శ్రీపతి నాగేశ్వర్‌నాథ్ పుట్టిన రోజు సందర్భంగా నిత్యావస రాలను పంపిణీ చేశారు. సమితి సభ్యులు ఉత్తరాది శివకుమార్, వాసా బాబు, రాజేశ్వరమ్మ, మణి, నాగరాజ, సుబ్రహ్మణ్యం, శంకరయ్య, ప్రసాద్, లక్ష్మయ్య సుబ్బరాయుడు, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

నందలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నట్లు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు యెద్దల విజయసాగర్ అన్నారు. శనివారం నందలూరు గ్రామ పంచాయతీ పేటగడ్డ పరిధిలో పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలు హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. టీడీపీ నాయకులు మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్‌కుమార్, గంధం గంగాధర్, గుండు సురేష్, ఉప్పుశెట్టి రెడ్డయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వీరబల్లి: నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఒక వరం లాంటిదని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీనే కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి పింఛన్ అందజేస్తోందన్నారు.

కాటిమాయకుంట గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

● ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి


కాటిమాయకుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో కాటిమాయకుంట గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఏపీఐఐసీ డైరెక్టర్ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామంలో పర్యటించారు. తాగునీటి, డ్రైనేజీ కాలువలు, రహదారులు తదితర సమస్యలపై గ్రామ సచివాలయ అధికారులతో కలిసి గ్రామస్తులతో చర్చించారు. అనంతరం గ్రామాల్లోని అర్హులైన లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర బీసీ సంక్షేమ డైరెక్టర్ గుడి స్వర్ణతో కలిసి ఆయన బొట్లచెరువు గ్రామంలో రేషన్‌షాప్ వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సక్రమంగా రేషన్ పంపిణీ జరుగుతుందా లేదా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయంలో అర్చకులు బండాత్మకూరు మణికంఠ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా వేంకటేశ్వరుడిని కొనియాడారు.

ముగ్గురు దొంగల అరెస్ట్


పట్టుబడిన దొంగలు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది

ధర్మవరంరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిగిచెర్ల గ్రామంలో వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మగుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసి నిందితులను గుర్తిం చామన్నారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

రాష్ట్ర స్థాయికి 'మడితాడు' విద్యార్థులు

సుండుపల్లె, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మడితాడు ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు అబిదుల్లా తెలిపారు. శనివారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్. ఇమ్రాన్ ఇక్బాల్, అండర్-17 క్రీడల్లో వెస్ట్ గోదావరి జిల్లాలో అక్టోబర్ 20, 21, 22వ తేదీల్లో జరిగిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చినట్లు తెలిపారు. అలాగే ఇర్ఫాన్ అండర్-17 క్రీడల్లో కర్నూలు జిల్లా అహో బిలంలో జరిగిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చడం జరిగిందన్నారు. అలాగే షేక్. ఇసాన్ ఇక్బాల్ అండర్-14 క్రీడల్లో కడప జిల్లా పులి వెందుల పట్టణం ధ్యాన్ చంద్ క్రీడామైదానంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చిన రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీయూ రాష్ట్ర నాయకులు ఆరీఫుల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు శివాజీ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి గాయపడిన వ్యక్తిని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కురబలకోట మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన ముని వెంకటప్ప కుమారుడు నరసింహులు అంగళ్లు నుంచి సీటీఎంకు వెళుతుండగా సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పడంతో నరసింహులు గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.



● భార్యాభర్త మధ్య జరిగిన చిన్న గొడవపై నాన్నమ్మ మందలించిందని ఇటీవల కడప నగరం శంకరాపురానికి చెందిన భార్యభర్త తమ ఏడాదిన్నర చిన్నారితో సహా రైలు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోయారు.

● అదే రోజు ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక కడప నగర శివార్లలో మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

● అనారోగ్య సమస్యల కారణంగా ఓ ఏఎస్ఐ కనుమలోపల్లి వద్ద, ఒక లారీ డ్రైవర్ కొండాపురం వద్ద రైలు కింద పడ్డారు.

● ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేయలేదంటూ తీవ్ర మనోవేదనకు గురైన ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువకుడు రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు.

కారణం ఏదైనా వీరి మృతి.. వారి కుటుంబాలకు కడుపుకోత మిగుల్చుతుందే తప్ప పరిష్కారం చూపలేదు. ఈ చిన్న లాజిక్‌ను గ్రహించలేక, క్షణం ఆలోచించక తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ఉసురు తీసుకుంటున్నారు. దీంతో రైల్వేట్రాక్‌లు సూసైడ్ స్పాట్‌గా మారుతున్నాయి. ఇనుప కమ్మీలపై రక్తపు మరకలు అంటుతున్నాయి. క్షణంలో వచ్చే చావు కంటే రైలు చక్రాల కింద తనువు అనుభవించే నరకం వర్ణనాతీతం.



రైల్వేట్రాక్‌లపై మృత్యుఘోష

● కుటుంబ కలహాలతో కొందరైతే.. అనారోగ్యం, ఆర్థికం, ప్రేమ వ్యవహారాలతో ఇంకొందరు

● పరిష్కారం లేదని చావును ఆశ్రయిస్తున్న పిరికి మనసులు

కడప క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పట్టాలు దాటే క్రమంలో కొందరైతే, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలు.. ప్రేమ, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు రైలు కిందపడి ప్రాణాలు విడుస్తున్నారు. ఇలా నిత్యం ఏదొక రూపంలో రైలు పట్టాలపై మృత్యుఘోష వినిపిస్తోంది. సమస్యలకు పరిష్కారమే లేదని నిండు ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. ఈక్రమంలో చనిపోయిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోతే ఆ కుటుంబ సభ్యులకు కడచూపు కూడా ఉండదు. ఇది ఎంతో బాధాకరం. కడప నుండి ఎర్రగుంట్ల, ఎర్రగుంట్ల నుండి జమ్మలమడుగు, కడప నుండి నందలూరు వరకు నిత్యం రైళ్ల రాకపోకలు వస్తుంటాయి. కడప పరిధిలో చాలావరకు రైలు మార్గం అడవుల గుండా ఉండటంతో రైల్వే అధికారులు సంఘనాస్థలానికి చేరుకోవడం కష్టతరంగా కూడా ఉంది.

కొన ఊపిరితో ఉన్నా కాపాడలేరు..

ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే నిమిషాల్లో పోలీసులకు కానీ, 108కు సమాచారం అందించి వారిని రక్షించే అవకాశం ఉంటుంది. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవరికీ కనిపించవు. ఎవరైనా రైలు కింద పడి తీవ్ర గాయాలపాలైనా కనీసం వారిని గుర్తించే అవకాశాలు కూడా ఉండవు. చివరికి కొన ఊపిరితో ఉన్నా రక్షించేవాడు లేక కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడవాల్సిందే.

గుర్తించడం పోలీసులకు కూడా కష్టమే..

రైలు ట్రాక్‌లపై చాలావరకు మృతదేహాలు గుర్తుపట్టలేనంత స్థితిలో కనిపిస్తుంటాయి. రైలు వేగంగా ఢీకొనడం, ఇనుప కమ్మీలు కావడంతో ప్రమాదం జరిగిన గంటల్లోనే మృతదేహం నల్లగా మారిపోతుంది. కొన్ని మృతదేహాలు తునకలుగా, ఇంకొన్ని ముఖం కనిపించకుండా, భయంకర స్థితిలో ఉంటాయి. ఇలాంటప్పుడు మృతుల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుంటే పోలీసులకు కూడా కష్టతరంగా ఉంటుంది. ఈ మృతదేహాలను సేకరించి మార్చురీలో భద్రపరచడంతో పాటు మృతికి సంబంధించిన వివరాలు మీడియా లేక వాల్‌పోస్టర్లతో పాటు ఇతర పోలీసుస్టేషన్లకు పంపించి ఆచూకీ కోసం ఎదురు చూడాల్సిందే. మృతదేహాలను రెండురోజుల్లో గుర్తించలేకపోతే కడప కార్పొరేషన్, మున్సిపాలిటీ, లేదా స్వచ్ఛంద సంస్థల ద్వారా అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తుంది.

బంగారు అభరణాల తయారీ దుకాణంలో చోరీ

● 20గ్రాముల బిస్కెట్, 30 గ్రాముల నల్లల దండ, 50వేల నగదు అపహరణ



సీసీ కెమెరాలో అనుమానుతుడి ఫొటో

ప్రొద్దుటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరయ్యగారి వీధిలో ఉన్న భారతీ కాంప్లెక్స్ రూమునెంబరు 5 బంగారు నగల తయారీ షాపులో శనివారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. ఈ మేరకు దుకాణం యజమాని పోలంకి మహేష్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలంకి మహేష్(37) వారానికి 30 గ్రాముల బంగారం తెచ్చుకుని ఆభరణాలు తయారు చేసి జ్యువెలరీ షాపులకు వేసేవాడు. శనివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళుతూ దుకాణ షట్టర్‌కు తాళాలు వేశాడు. కానీ తిరిగి వచ్చి చూసేసరికి దుకాణంలో వున్న 20 గ్రాముల గట్టుబంగారు బిట్టు, 30 గ్రాముల నల్లల దండ, 50 వేల నగదు మాయమయ్యాయి. సీసీ కెమెరాల్లో పరిశీలించగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి షట్టర్ తెరిచి దుకాణంలో వున్న బంగారాన్ని అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

కలసపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించిన మారె శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. రెండు రోజుల క్రితం తన తల్లితో కలిసి వెళుతున్న ఆ విద్యార్థినిని శ్రీను తన బైక్‌లో ఎక్కించుకొని వెళ్తూ మార్గమధ్యలో అసభ్యకరంగా ప్రవర్తించాడని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

మైదుకూరులో 269 మందిపై కేసులు నమోదు

మైదుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు నెలల కాలంలో మద్యం తాగి మోటారు వాహనాలు నడుపుతున్న 107 మందిపై, అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన 167 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామని అర్బన్ సీఐ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువత మద్యం తాగడం వల్ల ప్రమాదాలకు గురి కావడమే గాక ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గండికోట నుంచి 2000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం మధ్యాహ్నం నుంచి 2000క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3400 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.76 టీఎంసీ ల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

అనుమతి తీసుకున్న గదుల్లోనే ల్యాబ్

● సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ల్యాబ్ సీజ్ : డీడీఎంహెచ్‌వో గీత



ల్యాబ్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న డాక్టర్లు అనుమతి తీసుకున్న గదుల్లోనే స్కానింగ్ మిషన్లను ఉంచాలని, ఇతర రూముల్లోకి మార్చకూడదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను శనివారం డీడీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ఈ ఆస్పత్రి నుండి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆర్ఎంపీ కేంద్రానికి స్కానింగ్ మిషన్‌ను తరలించారని ఆధారాలతో ఫిర్యాదు అందిందని, ఈ మేరకు తనిఖీలు నిర్వహించి ఓపీ ల్యాబ్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమతి తీసుకున్న చోటే ల్యాబ్ నిర్వహించాలని, అలాకాకుండా మార్చితే చట్టవ్యతిరేకం అవుతుందని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగనిర్ధారణ నేరమని, చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఈఎంవో భారతి, దేవాంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దౌలా, ఎన్‌సీడీ డాక్టర్ ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడులో ఉన్న తిరువణ్ణామలై (అరుణాచలం) గిరిప్రదక్షిణకు జిల్లా నుండి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కడప రీజియన్‌లోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుండి ఈనెల 4వ తేదీ మంగళవారం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక సోమవారాలలో, కార్తీక పౌర్ణమి రోజున తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అరుణాచలంతో పాటు ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, పొలతల, నిత్యపూజకోన, శివాలయాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అనువుగా ఉంటుందని, సీట్లు బుకింగ్ చేసుకుని అరుణాచల గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో పూర్తిచేయాలని కోరారు. కడప డిపో నుండి తిరువణ్ణామలైకు టికెట్ ధర రూ.1044, బద్వేలు డిపో నుండి రూ.1282, మైదుకూరు డిపో నుండి రూ.1209, ప్రొద్దుటూరు డిపో నుండి రూ.1273, పులివెందుల డిపో నుండి రూ.1193, జమ్మలమడుగు డిపో నుండి రూ.1363 టికెట్ ధర ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అంకాళమ్మగూడూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

సింహాద్రిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో అక్టోబరు 31న రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో అండర్-14 విభాగంలో భానుకుమార్, సాఫ్ట్‌బాల్ పోటీలలో అండర్-17 విభాగంలో అరవిందనాథరెడ్డి ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈనెలలో చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థు ఎంపికైన విద్యార్థులను, పీడీ శిరీషను అభినందించారు.

వెంకయ్యకు ఉరుసు ఉత్సవాల ఆహ్వానం

కడప కల్చరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 5 నుండి 9వ తేదీ వరకూ జరుగనున్న పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును పెద్దదర్గా శిష్యులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులున్నారు.

హాస్టల్‌పై అధికారుల విచారణ



పులివెందుల ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులను విచారిస్తున్న ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి

పులివెందుల రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పులివెందులలోని గాయత్రినగర్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో జరిగిన ఉదంతంపై శనివారం జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో శనివారం రాత్రి ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి, ఇతర అధికారులతో కలిసి హాస్టల్‌లో జరుగుతున్న విషయాలపై విద్యార్థులను విచారించారు. హాస్టల్‌లో వార్డన్ సరిగా ఉండడం లేదని, మెనూ సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. కేర్ కేటింగ్ లేదని, ట్యూటర్ లేరని, ఉదయం పూట టిఫెన్ తినాలంటే ఇబ్బందిగా ఉంటోందని, శుభ్రంగా ఉండడం లేదని రాతపూర్వకంగా వివరించారు. మరుగుదొడ్లు సరిగా మెయింటెన్ చేయకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోందని, ఏదైనా ఆరోగ్యం బాగలేకపోయి వార్డన్‌ను అడిగితే దుర్భాషలాడుతారని, నైట్ వాచ్‌మెన్ ముని తమను ఆసుపత్రికి తీసుకెళ్తాడన్నారు. తమకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని విద్యార్థులు కోరారు. అనంతరం వంట ఎందుకు సరిగా చేయడం లేదని వంట మనిషిని ప్రశ్నించారు. సమయానికి వండి వడ్డించడానికి సరుకులు రావడం లేదని, సరుకులు లేకపోతే పిల్లలకు ఎలా రుచిగా వండిపెట్టగలనని వంటమనిషి తెలిపారు. అనంతరం వార్డన్ మోహన్‌ను విచారించి రాతపూర్వకంగా తీసుకున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి ఆంధ్రజ్యోతికి వివరించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సీకేదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంటల నష్ట నివారణపై శ్రద్ధ వహించాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను వలన కడప, అన్నమయ్య జిల్లాలో జరిగిన నష్టాలపై వ్యవసాయ డివిజన్ అధికారులు పంట నష్టం అంచనాలు చేయడంతో పాటు రైతులకు పంట నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్యకుమార్, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ క్రిష్ణప్రియ, ఆత్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఏడీఏలు రైతులకు పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ డీడీఏ నాగరాజు, వివిధ డివిజన్ల ఏడీఏలు, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, సుబ్రమణ్యం, మాధురి, శ్రీవల్లి, యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో ఎన్నో ప్రయోజనాలు

వల్లూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పోలు, తప్పెట్లలో నీటి యాజమాన్య సంస్థ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న హార్టికల్చర్ సోక్ పిట్స్, హౌస్ కంపోస్టు పిట్స్ ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హార్టికల్చర్ కింద చేపడుతున్న పండ్ల తోటల పెంపకం రైతులతో మాట్లాడారు. తప్పనిసరిగా మొక్కలు పెంచి లాభం పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడుగుంతల్లో నీరు ఇంకి వీధులు జలమయం కాకుండా ఉపయోగపడతాయని తెలిపారు. ఈయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

వ్యక్తిపై దాడి, కిడ్నాప్

● పలువురిపై కేసు నమోదు

పులివెందుల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డిపై పులివెందులకు చెందిన యల్లారెడ్డి, అతని అనుచరులు కిడ్నాప్ చేసి దాడి చేశారు. దీనిపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డి చెక్‌బౌన్స్ కేసులో శనివారం పులివెందుల కోర్టుకు వచ్చారు. అనంతరం కారులో తిరిగివెళ్తుండగా పులివెందుల శివార్లలో యల్లారెడ్డి, అతని అనుచరులు కారును ధ్వంసం చేసి అతడిని కిడ్నాప్ చేసి ఓ తోటలోకి తీసుకెళ్లి దాడి చేశారని ప్రియాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రియాంత్‌రెడ్డికి, యల్లారెడ్డికి గతంలో లావాదేవీలు ఉండేవి. ప్రియాంత్‌రెడ్డి డబ్బులు ఇవ్వకపోవడంతో యల్లారెడ్డి పులివెందుల కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశారు. గతంలో యల్లారెడ్డిపై హైదరాబాద్‌లో కేసు పెట్టించారని, దాని పర్యవసానంగా పులివెందులలో తన అనుచరులతో దాడి చేసినట్లు ప్రియాంత్‌రెడ్డి పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

● జిల్లా ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి

లింగాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లె గ్రామంలో రైతు ఉదయ్‌కృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహజ ఎరువులు, ద్రావణాలు, కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు, పంచగవ్య మొక్కల పెరుగుదలకు కావాల్సిన ద్రావణాలు ఈ కేంద్రంలో లభిస్తాయని, రైతులు వీటిని ఉపయోగించుకుని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచు విజయభాస్కర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ ఎంటీ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, తదితరులు

125 పరుగులకే కర్నూలు ఆలౌట్

● 100 పరుగుల వెనుకంజలో అనంతపురం జట్టు



6వికెట్లు సాధించిన రోహిత్‌రెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం రెండు వేర్వేరు జట్ల మధ్య సాగిన క్రికెట్ మ్యాచ్‌లలో కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌట్ కాగా.. నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 100 పరుగుల వెనుకంజలో వుంది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప, కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు 69.5 ఓవర్లలో కేవలం 125 పరుగులకు ఆలౌట్ అయింది. రిషిత్ 44 పరుగులు చేయగా కడప జట్టు బౌలర్ ముని జ్ఞానేశ్వర్ 4 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇందులో అష్కాన్ 31 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో కడప జట్టు మరో 57 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 58.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. కిన్నుకిశాల్ 48 పరుగులు చేశారు. కాగా బౌలింగ్ విభాగంలో అనంతపురం బౌలర్ రోహిత్‌రెడ్డి 6 వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు మరో 100 పరుగుల వెనుకంజలో వుంది.

పేదల సేవలో కూటమి ప్రభుత్వం : చమర్తి





పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు.. వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వేమన సతీష్

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదల సేవలో కూటమి ప్రభుత్వం తరిస్తోందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శనివారం రాజంపేట మండలం నూనెవారిపల్లెలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి పేదవాడి ఇంటిలో పెద్దకొడుకుగా నేనున్నాంటూ పింఛన్లను ఐదు రెట్లు పెంచి భరోసా కల్పిస్తున్నారన్నారు.రాజంపేట మార్కెట్ యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ సీనియర్ టీడీపీ నాయకుడు దొంతం శివ, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు రెడ్డయ్యనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, కౌన్సిలర్ గుణకల చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

వేమన సతీష్ ఆధ్వర్యంలో...

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం ఊటుకూరు గ్రామంలో తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ వృద్ధాప్య పించన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కర్నాటి చెంగల్‌రాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పించన్ల మొత్తాన్ని పెంచి అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేస్‌నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ రాఘవవర్మ ఆధ్వర్యంలో కార్యక్ర మం చేపట్టారు. కూట మి, తెలుగుదేశం నాయకులు ప్రతాప్‌రాజు, బీజేపీ సీనియర్ నాయకులు యర్రం రాజు, సురేస్‌రాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



పింఛను అందజేస్తున్న బీజేపీ నాయకుడు సాయిలోకేశ్

పింఛన్ల పంపిణీలో టీడీపీ యూత్

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా శనివారం జరిగిన సామాజిక పించన్ల కార్యక్రమంలో భాగంగా ఓబిలి టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా, కార్యదర్శి ఎస్.నాగేంద్ర, మాజీ సర్పంచ్ ఎస్.హబీబుల్లాలు పాల్గొని గ్రామ పరిధిలోని ఇంటింటిక వెళ్లి పించన్లు పంపిణీలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో టీడీపీ అలుపెరగకుండా టీడీపీ నాయకులు పాల్గొనడం విశేషం.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచుపల్లె, ఖాజీపల్లె గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసింది. ఈ చెక్కులను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు అంద జేశారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచి తక్షణ సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, శ్రీనివాసుల రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సత్య చిట్‌ఫండ్ ఎండీ బాలక్రిష్ణారెడ్డి, మాచుపల్లె ఓబుల్‌రెడ్డి, కాజీపల్లె కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యను కలిసిన సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జరిగిన జానుమద్ది స్మారక సాహిత్య గ్రంథాలయ సేవా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మ విభూషణ్ డాక్టర్ ముప్పవరపు వెంకటయ్యానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





అమరజీవి త్యాగఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ



రైల్వేకోడూరు: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్ర అవతణ జరిగిందని బీజేపీ సీనియర్ నాయకుడు తోట శ్రీనివాసులు తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి, బీజేపీ పార్టీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.





అంగన్వాడీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక



ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు నూతన కమిటీ సభ్యులు

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఐసీడీఎస్ చిత్తూరు ప్రాజెక్టు నూతన కమిటీ శనివారం బెస్తపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఎన్నికైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు, వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిట్వేలి ప్రాజెక్టు అధ్యక్షురాలిగా అన్నపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా వసంత, కోశాధికారిగా ఉమామహేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధామణి, సహాయ కార్యదర్శిగా సుజాత, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. పెనగలూరు, చిట్వేలి మండలాల అంగన్వాడీ వర్కర్‌లు, సహాయకులు హాజరయ్యారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు



రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తిరుపతి-రాజంపేట ప్రధానదారిపై భారీగా గుంతలలు ఏర్పడ్డాయి. గత నెల 28న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఎంత కష్టం..ఎమిటీ నిర్లక్ష్యం..?' అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడింది. అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. గుంతల్లో మట్టి పోసి కంకర వేసి పూడ్చారు. తారు రోడ్డు వేస్తామని అధికారులు తెలిపారు. వర్షాలు పూర్తిగా ఆగిన తర్వాత నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యపూజేశ్వరకోనలో రహదారి మరమ్మతులు

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం వల్ల నిత్యపూజేశ్వరకోనకు భక్తులు వెళ్లే రహదారి అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి రహదారి చదును పనులను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల మూతికోన వద్ద రహదారి దెబ్బతిందని, తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి చదును పనులు చేపట్టామన్నారు. ఎండోమెంట్ సిబ్బంది చంద్ర, కూలీలు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన పోతుగుంట

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడును కలిసి సత్కరించారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా తాను ఎన్నికయ్యానని తెలియజేశారు. బొకే అందించి శాలువా కప్పి సత్కరించారు.

ఒంటిమిట్ట: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ బి.లక్ష్మీ నారాయణనాయుడు కలిశారు. శనివారం కడపకు విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతిని ఈయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం కొత్త బోయనపల్లె ఎస్‌జేఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.రెడ్డిసాయి రాజ్యాంగ దినోత్సవం వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాడు. శనివారం రాజంపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసెంబ్లి నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి సి.రెడ్డిసాయి నియోజకవర్గస్థాయికి ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం కె.భారతి తదితరులు అభినందించారు.

డయాలసిస్ రోగికి పింఛను పంపిణీ

గాలివీడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన తమ్మిశెట్టి చంద్రయ్య అనే డయాలసిస్ రోగికి శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ రూ.10,200 ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను పంపిణీ చేశారు.

ఐదు నెలలుగా తనకు రాయచోటి ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ చేస్తున్నారని, అయితే ఇంతవరకు పింఛన్ రాలేదని మంత్రికి వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి బాధితుని సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.







సమస్యల పరిష్కారానికి వినతి

సుండుపల్లె, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు జనసేన నేత రామా శ్రీనివాస్ శనివారం తెలిపారు. పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలో రాచపల్లి దిగువ పింఛా నదిపై, రాయవరం దిగువ భాగాన బాహుదా నదిపై హైలెవల్ వంతెనలు నిర్మించాలని కోరారు. అలాగే ముడుంపాడు కాజ్‌వేపై రక్షణ గోడ నిర్మించాలని, సుండుపల్లె రాయచోటి డబుల్ రోడ్డు పనులు సత్వరం ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అలాగే రాయచోటి- రాజంపేట రహదారి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, సుండుపల్లె నుంచి రాజంపేటకు రెండు వరుసల రహదారి నిర్మించాలని కోరారు. అగ్రహారం నుండి సామిసేని గడ్డ వరకు 5 పల్లెలకు వెళ్లే రహదారి గుంతల మచంగా మారి రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఈ విషయంపై సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దేవస్థానానికి శ్రీకృష్ణ అన్నదాన ట్రస్టు(కువైట్) అధ్యక్షుడు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చేజర్ల రామకృష్ణమరాజు, కార్యదర్శి రమణయ్య, ఉప కార్యదర్శి నాగేశ్వరరావునాయుడు, కోశాధికారి గడ్డం వీరనారాయణరావునాయుడు రూ.55 వేలు విలువ చేసే ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.







పట్టణ ప్రజలకు ఆటవిడుపుగా ఏర్పాటు చేసిన పార్క్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. పట్టణ వాసుల వినోదానికి మేం అవకాశం కల్పిస్తున్నా మని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న వైసీపీ ప్రభుత్వంలోనే పార్క్ అంటే భయం గొలిపేలా తయారైంది. కోట్ల రూపాయలు విలువైన రెండు ఎకరాల దేవాలయ స్థలంలో రూ. 20 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం నిరుపయోగంగా మారి పట్టణ వాసులను ఉసూరుమనిపించింది.

అటకెక్కిన 'ఆటవిడుపు'

- అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన పార్కు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలు
- తుప్పుపట్టిన పరికరాలు, ధ్వంసమైన బల్లలు
- పాలకుల ఆరంభ శూరత్వం
- కొద్ది రోజులకే కొరవడిన పర్యవేక్షణ

పీలేరు రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి సంతరించుకుంటున్న పీలేరు పట్టణంలో ఉద్యానవనం ఏర్పాటు విషయంలో పాలకులు ప్రజలను ఊరిస్తూ వచ్చారు. సుమారు 60 వేల జనాబా ఉన్న పట్టణంలోని ప్రజలు ఆటవిడుపుకోసం వారాంతాల్లో తిరుపతి, హార్సీలీహిల్స్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో సర్వే నెంబర్ 493లో శివాలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన రెండెకరాల స్థలంలో రూ. 20 లక్షలతో కాశీవిశాలాక్షీ ఉద్యానవనం ప్రారంభించారు. ఇందులో పెద్దలకు అనుకూలంగా వాకింగ్ ట్రాక్, విశ్రాంత బల్లలు ఏర్పాటు చేశారు. అహ్లాదకర వాతావరణం కల్పించడం కోసం వివిధ రకాల పూలమొక్కలు, పచ్చదనం నింపేలా స్పాంజ్ గ్రాస్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల కోసం జారుడు బల్లలు, ఉయ్యాల తదితర పరికరాలు ఏర్పాటు చేశారు. చిన్నచిన్న పంక్షన్లు చేసుకు నేందుకు ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేశారు. దీంతో కొంత కాలం పార్క్ కళకళలాడింది. అయితే పార్కు నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సిన పాలకులు, అధికారులు బాధ్యతలను గాలికి వదిలేశారు. ఉద్యానవనానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం, ప్రారంభించిన పాలకవర్గం అధికారంలో కొనసాగుతున్నా పార్క్ నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా ఉద్యానవనం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీంతో మహిళలు,



అధ్వానంగా మారిన వాకింగ్ ట్రాక్



విరిగి పోయిన బల్లలు

వృద్ధులు పార్కుకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు, పోలీస్ పర్యవేక్షణ కొరవడడం, రెండేళ్లకే పార్క్‌ను వదిలేయడం, కనీసం పంచాయతీ అధికారులు సైతం పార్క్ నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు గుప్పుమంటు న్నాయి.

అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు...

పట్టణ ప్రజల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన పార్క్ మొత్తం పిచ్చిమొక్కలు అల్లుకు పోయి దర్శనమిస్తున్నాయి. వాకర్లు పాముల భయంతో హడలిపోతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు నోచుకోక పోవడం విచారకరం. చిన్నపిల్లల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. మరో వైపు పెద్దలు, మహిళలు సేద తీరడం కోసం ఏర్పాటు చేసిన బల్లలను సైతం ధ్వంసం చేయడం గమనార్హం.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతాం..



పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పార్క్ ఏర్పాటు తప్పని సరి. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పార్క్ నిరాదరణకు గురవడం వారి వైఫల్యమే. పార్కును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళతాం. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పార్క్‌ను ముందుకు తీసుకెళతాం.

- గోళ్ల కిశోర్ నాయుడు, ఏఎంసీ డైరెక్టర్, పీలేరు

అభివృద్ధి చేయాలి



పట్టణ ప్రజల ఆటవిడుపు కోసం శిథిలావస్థకు చేరిన పార్క్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనతి కాలంలోనే పార్క్ అక్కరకు రాకుండా పోవడం శోచనీయం. గ్రామ పంచా యతీ అధికారులు, పాలక వర్గం వాస్తవ పరిస్థితులను గుర్తించి సమన్వయంతో ముందుకు పోవాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్క్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఏ. విశ్వనాథరెడ్డి, టీచర్, పీలేరు

ఆటో బోల్తా.. విద్యార్థినులకు గాయాలు



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఈవో , ప్రిన్సిపాల్

తంబళ్లపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుక్కలు అడ్డురావడంతో ఆటో బోల్తా పడి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. రామిగానిపల్లె, కురవపల్లె, పెండేరివారిపల్లెకు చెంది న సుమారు 12 మంది విద్యార్థులు శనివారం ఉదయం ఆటోలో పాఠశాలకు వెళ్తుండగా.. అడ్డుగా వచ్చిన కుక్కలను తప్పించే యత్నంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 7వ తరగతి విద్యార్థిని స్వాతి, 8వ తరగతి విద్యార్థినులు శృతి, వెన్నెల స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసు కున్న ఎంఈఓ త్యాగరాజు, ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ విద్యార్థినులను పరామర్శించారు.

బాలుడి ఆచూకీ కోసం గాలింపు

తంబళ్లపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన విద్యార్థి చరణ్ కోసం పోలీసులు, హాస్టల్ ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లితండ్రులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తంబళ్లపల్లె ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి చరణ్ శుక్రవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం తంబళ్లపల్లె-మదనపల్లె రోడ్డులో నడుచుకుని వెళ్లినట్లు రామిగానిపల్లె సమీపంలో ఉన్న ఓ సీసీ కెమెరా ద్వారా పోలీసులు గుర్తించారు. శనివారం తెల్లవారుజాము నుంచి హాస్టల్ సిబ్బంది, విద్యార్థి తల్లితండ్రులు, పోలీసులు సుమారు ఎనిమిది బృందాలుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తంబళ్లపల్లె నుంచి కన్నెమడుగు, ముదివేడు, మదనపల్లె వరకు రోడ్డుకు పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థి తల్లితండ్రులు కురబలకోట, ములకలచెరువు, మదనపల్లె, గుర్రంకొండ, నిమ్మనపల్లె, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల తీవ్రంగా గాలించారు. శనివారం సాయంత్రం వరకు విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదని హాస్టల్ ఉపాధ్యాయులు తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్



నిందితులు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఇటీవల చిగిచెర్ల గ్రామంలోని వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ గుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసి నిందితులను గుర్తించామన్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంక టేశ్వర్లు చోరీలు చేసినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

అంగన్వాడీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఐసీడీఎస్ చిత్తూరు ప్రాజెక్టు నూతన కమిటీ శనివారం బెస్తపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఎన్నికైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు, వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిట్వేలి ప్రాజెక్టు అధ్యక్షురాలిగా అన్నపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా వసంత, కోశాధికారిగా ఉమామహేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధామణి, సహాయ కార్యదర్శిగా సుజాత, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. "అంగన్వాడీ వర్కర్‌లు, సహాయకులు హాజరయ్యారు.

వెంకయ్యనాయుడును కలిసిన పోతుగుంట

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడును కలిసి సత్కరించారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా తాను ఎన్నికయ్యానని తెలియజేశారు. బొకే అందించి శాలువా కప్పి సత్కరించారు. ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ బి.లక్ష్మీ నారాయణనాయుడు కలిశారు. శనివారం కడపకు విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతిని ఈయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పన

- రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అతిశయ



మాట్లాడుతున్న చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అతిశయ

మదనపల్లె టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆధారంగా మెరుగైన వసతుల కల్పనకు అమృత్ సంవాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైల్వే చీఫ్ కమర్షియల్‌ఇన్‌స్పెక్టర్ అతిశయ తెలిపారు. శనివారం మదనపల్లె మండలంలోని సీటీఎం (మదనపల్లె రోడ్డు) రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, ప్రజలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 2047 నాటి రైల్వే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించ నున్నామన్నారు. అమృత్ స్టేషన్‌లలో స్టేషన్‌ల ఆధునికీకరణ, ఆధునిక టెక్నాలజీ, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేం దుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ప్రజలు కూడా వారి అభి ప్రాయాలను తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐ ఇంజినీర్ అజయ్ టెండూల్కర్, స్టేషన్ సూపరింటెండెంట్ జాబీర్‌బాషా, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొండూరు శ్రీనివాసరాజు

మదనపల్లెఅర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదోతర గతి పరీక్ష కేంద్రాలను శనివారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కొండూరు శ్రీనివాస రాజు పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి వసతి తదితర అంశాలపై ఆరా తీస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆవో కార్యాలయ సూపరింటెండెంట్ రవి, ప్రధానోపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌కాన్, సుబ్బారెడ్డి, షాజహన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్ర అవతణ జరిగిందని బీజేపీ సీనియర్ నాయకుడు తోట శ్రీనివాసులు తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి, బీజేపీ పార్టీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగళ్లులో సర్కిల్ పోలీసు స్టేషన్!



ముదివేడు పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

కురబలకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అంగళ్లలో సర్కిల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.శనివారం మండలంలోని ముదివేడు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగళ్లు సమీపంలో సర్కిల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందని, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ అధి కారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను అందించారన్నారు. అనుమతులు రాగానే భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల సమీపంలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ యత్నం అడ్డుకున్నందుకు దాడి

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్నందుకు భూమి యజమానిపై ఆక్రమణదారులు దాడి చేసి గాయపరిచారు. జిల్లా ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బి.కొత్తకోటకు చెందిన ఎం. గంగిరెడ్డికి బి.కొత్తకోటలో 22 సెంట్ల భూమి ఉంది. బి.కొత్తకోటకు చెందిన పీరుబాయ్, షఫి మరో పది మంది శనివారం ఆ భూమిని చదును చేస్తుండగా గంగిరెడ్డి అడ్డుకున్నాడు. దీంతో వారు అతనిపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి గాయపడిన వ్యక్తిని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కురబకోట మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన మునివెంకటప్ప కుమారుడు నరసింహులు అంగళ్లు నుంచి సీటీఎంకు వెళుతుండగా సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పడంతో నరసింహులు గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



గంగ

రామసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బలిజ వీధికి చెందిన గంగ అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అక్టోబరు 30 ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలే దని పలుచోట్ల వెదికినా గంగ జాడ కనిపించలేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంధువుల నుంచి రక్షణ కల్పించండి

- విలేకరుల సమావేశంలో మహిళల ఆవేదన



మాట్లాడుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తికోసం మేనత్త, ఆమె భర్త తమను చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, నానమ్మ, తాతయ్యను మచ్చిక చేసుకుని తమ ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్ని స్తున్నారని, వారితో తమకు ప్రాణహాని ఉందని మానస, పావని, నవ్యశ్రీ అనే యువతులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ మదనపల్లె లోని నీరుగట్టువారిపల్లెకు చెందిన మంజుల, సురేష్‌కుమార్ దంపతులకు తాము ముగ్గురు కూతుళ్లమని, తెట్టు గ్రామం, గుంతపల్లె వంకలో రెండున్నర ఎకరాల పొలం, బికొత్తకోట మంచిలం, కుమ్మరపల్లెలో రెండన్నర ఎకరాల పొలం, నీరుగట్టువారి పల్లెలో ఇళ్లు, రామిరెడ్డి లేవుట్‌లో ఐదు షాపురూములు, అక్కడక్కడ ఇంటి స్థలాలు ఉన్నాయన్నారు. ఏడాది క్రితం తమ తండ్రి సురేష్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడని, ఇదే అదునుగా చేసుకుని మేనత్త కమలమ్మ, ఆమె భర్త సురేంద్ర తమ తండ్రికి చెందాల్సిన ఆస్తి మొత్తం కొట్టేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. నాన్నమ్మ, తాతయ్యను మచ్చిక చేసుకుని వారి పేరిట ఉన్న ఆస్తులను రిజిస్టర్ చేయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఇందుకు ఒప్పుకోక పోవడంతో తమ తల్లి మంజులను ,తమను అడ్డు తొలగించడానికి చూస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నామ న్నారు. తమ తండ్రి ఆస్తి తమకు దక్కేలా న్యాయం చేయాలని అర్థిస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ.. రెండు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

పీలేరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటి సంరక్షించాలని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్ తెలిపారు. కార్తీక వన మహోత్సవంలో భా గంగా శనివారం కేవీపల్లె మండలం మారేళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. మొక్కుబడిగా నాటేసి వదిలేయడం వల్ల ఉపయోగం ఉండదని తెలిపారు. వాతావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతున్న కారణంగా అతివృష్టి అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయడం కోసం తరచూ ఇలాంటి కార్య క్రమాలు నిర్వహించాల్సిన ఆవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నబియాసుల్తానా, బీట్ అధికారులు బీ.రెడ్డి ఆసియా, జగదీష్, చంద్రకళ, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం వెంకటాద్రి

కలకడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలకు నడమిచెర్ల హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటాద్రి తెలిపారు. ఇటీవల మంచూరు జడ్పీహైస్కూల్‌లో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు భానుప్రసాద్ (బాలుర), జ్ఞానప్రియ(బాలికల) విభాగంలో ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు ఈ నెలలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా తరపున పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి, వెంకటాద్రి, రమేష్‌బాబు, శివానంద, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు రెడ్డివారిపల్లి విద్యార్థి



విద్యార్థి విక్రాంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిమ్మనపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విక్రాంత్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అక్టోబరు కర్నూలులో జరిగిన ఎనిమిదో రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7న ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరగనున్న 49వ జూనియర్స్ జాతీయ స్థాం ు పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విశ్వసాయి

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న నెట్‌బాల్ పోటీలకు మదనపల్లెకు చెందిన మున్సిపల్ డీపీఓ శివప్రసాద్ కుమారుడు వెంకట విశ్వసాయి ఎంపికయ్యాడని పీడీ కమలేష్ తెలిపారు. గత నెలాఖరులో కొత్త మంచూరు జడ్పీహైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విశ్వసాయి అండర్-17 నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారన్నారు. మున్సిపల్ ఉద్యోగులు ఆ విద్యార్థిని అభినందించారు.

క్రీడల్లో మెరిసిన మట్లి పెద్దూరు విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీల్లో మట్లి పెద్దూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 16 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో హర్షవర్ధన్, పవన్, రూప, అండర్-14 విభాగంలో రెడ్డిగీత, హేమశ్రీ, సిసింద్రీ, సుబ్రమణ్యం, జగదీశ్, అండర్-17 బేస్‌బాల్‌లో రూప, హర్షవర్ధన్, పవన్, అండర్-14లో ఆర్. విష్ణువర్ధన్, సీ. జగదీశ్, జగదీశ్, సిసింద్రీ, సుబ్రమణ్యం, రెడ్డి గాయత్రి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ సంచాలకుడు జగదీశ్వరయ్యను ఉపాధ్యాయ బృందం, కమిటీ చైర్మన్ నాగేశ్వర్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మడితాడు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సుండుపల్లె, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మడితాడు ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు అబీదుల్లా తెలిపారు. శనివారం పాఠశాలలో ఆయా విద్యార్థులకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్. ఇమ్రాన్ ఇక్బాల్, అండర్-17 వెస్ట్ గోదావరి జిల్లాలో అక్టోబర్ 20, 21, 22వ తేదీల్లో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. కర్నూలు జిల్లా అహోబిలంలో జరిగిన పోటీల్లో ఇర్ఫాన్ అండర్-17 బేస్ బాల్ పోటీల్లో, కడప జిల్లా పులివెందుల పట్టణం ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీ అండర్-14 విభాగంలో షేక్. ఇసాన్ ఇక్బాల్ ఉత్తమ ప్రతిభను కనపర్చిన రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఆరీఫుల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు శివాజీనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ పోటీలకు మంచూరు విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

వాల్మీకిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్ బాల్ పోటీ లకు వాల్మీకిపురం మండలం లోని కొత్తమంచూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపి కయ్యారు. శనివారం పాఠశా ల ప్రాంగణలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన పావని, మిషికుమారి విశేష ప్రతిభ కనబరిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జటుకు ఎంపికయ్యారు. త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు.



● భార్యాభర్త మధ్య జరిగిన చిన్న గొడవపై నాన్నమ్మ మందలించిందని ఇటీవల కడప నగరం శంకరాపురానికి చెందిన భార్యభర్త తమ ఏడాదిన్నర చిన్నారితో సహా రైలు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోయారు.

● అదే రోజు ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక కడప నగర శివార్లలో మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

● అనారోగ్య సమస్యల కారణంగా ఓ ఏఎస్ఐ కనుమలోపల్లి వద్ద, ఒక లారీ డ్రైవర్ కొండాపురం వద్ద రైలు కింద పడ్డారు.

● ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేయలేదంటూ తీవ్ర మనోవేదనకు గురైన ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువకుడు రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు.

కారణం ఏదైనా వీరి మృతి.. వారి కుటుంబాలకు కడుపుకోత మిగుల్చుతుందే తప్ప పరిష్కారం చూపలేదు. ఈ చిన్న లాజిక్‌ను గ్రహించలేక, క్షణం ఆలోచించక తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ఉసురు తీసుకుంటున్నారు. దీంతో రైల్వేట్రాక్‌లు సూసైడ్ స్పాట్‌గా మారుతున్నాయి. ఇనుప కమ్మీలపై రక్తపు మరకలు అంటుతున్నాయి. క్షణంలో వచ్చే చావు కంటే రైలు చక్రాల కింద తనువు అనుభవించే నరకం వర్ణనాతీతం.



రైల్వేట్రాక్‌లపై మృత్యుఘోష

● కుటుంబ కలహాలతో కొందరైతే.. అనారోగ్యం, ఆర్థికం, ప్రేమ వ్యవహారాలతో ఇంకొందరు

● పరిష్కారం లేదని చావును ఆశ్రయిస్తున్న పిరికి మనసులు

కడప క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పట్టాలు దాటే క్రమంలో కొందరైతే, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలు.. ప్రేమ, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు రైలు కిందపడి ప్రాణాలు విడుస్తున్నారు. ఇలా నిత్యం ఏదొక రూపంలో రైలు పట్టాలపై మృత్యుఘోష వినిపిస్తోంది. సమస్యలకు పరిష్కారమే లేదని నిండు ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. ఈక్రమంలో చనిపోయిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోతే ఆ కుటుంబ సభ్యులకు కడచూపు కూడా ఉండదు. ఇది ఎంతో బాధాకరం. కడప నుండి ఎర్రగుంట్ల, ఎర్రగుంట్ల నుండి జమ్మలమడుగు, కడప నుండి నందలూరు వరకు నిత్యం రైళ్ల రాకపోకలు వస్తుంటాయి. కడప పరిధిలో చాలావరకు రైలు మార్గం అడవుల గుండా ఉండటంతో రైల్వే అధికారులు సంఘనాస్థలానికి చేరుకోవడం కష్టతరంగా కూడా ఉంది.

కొన ఊపిరితో ఉన్నా కాపాడలేరు..

ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే నిమిషాల్లో పోలీసులకు కానీ, 108కు సమాచారం అందించి వారిని రక్షించే అవకాశం ఉంటుంది. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవరికీ కనిపించవు. ఎవరైనా రైలు కింద పడి తీవ్ర గాయాలపాలైనా కనీసం వారిని గుర్తించే అవకాశాలు కూడా ఉండవు. చివరికి కొన ఊపిరితో ఉన్నా రక్షించేవాడు లేక కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడవాల్సిందే.

గుర్తించడం పోలీసులకు కూడా కష్టమే..

రైలు ట్రాక్‌లపై చాలావరకు మృతదేహాలు గుర్తుపట్టలేనంత స్థితిలో కనిపిస్తుంటాయి. రైలు వేగంగా ఢీకొనడం, ఇనుప కమ్మీలు కావడంతో ప్రమాదం జరిగిన గంటల్లోనే మృతదేహం నల్లగా మారిపోతుంది. కొన్ని మృతదేహాలు తునకలుగా, ఇంకొన్ని ముఖం కనిపించకుండా, భయంకర స్థితిలో ఉంటాయి. ఇలాంటప్పుడు మృతుల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుంటే పోలీసులకు కూడా కష్టతరంగా ఉంటుంది. ఈ మృతదేహాలను సేకరించి మార్చురీలో భద్రపరచడంతో పాటు మృతికి సంబంధించిన వివరాలు మీడియా లేక వాల్‌పోస్టర్లతో పాటు ఇతర పోలీసుస్టేషన్లకు పంపించి ఆచూకీ కోసం ఎదురు చూడాల్సిందే. మృతదేహాలను రెండురోజుల్లో గుర్తించలేకపోతే కడప కార్పొరేషన్, మున్సిపాలిటీ, లేదా స్వచ్ఛంద సంస్థల ద్వారా అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తుంది.

బంగారు అభరణాల తయారీ దుకాణంలో చోరీ

● 20గ్రాముల బిస్కెట్, 30 గ్రాముల నల్లల దండ, 50వేల నగదు అపహరణ



సీసీ కెమెరాలో అనుమానితుడి ఫొటో

ప్రొద్దుటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరయ్యగారి వీధిలో ఉన్న భారతీ కాంప్లెక్స్ రూమునెంబరు 5 బంగారు నగల తయారీ షాపులో శనివారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. ఈ మేరకు దుకాణం యజమాని పోలంకి మహేష్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలంకి మహేష్(37) వారానికి 30 గ్రాముల బంగారం తెచ్చుకుని ఆభరణాలు తయారు చేసి జ్యువెలరీ షాపులకు వేసేవాడు. శనివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళుతూ దుకాణ షట్టర్‌కు తాళాలు వేశాడు. కానీ తిరిగి వచ్చి చూసేసరికి దుకాణంలో వున్న 20 గ్రాముల గట్టుబంగారు బిట్టు, 30 గ్రాముల నల్లల దండ, 50 వేల నగదు మాయమయ్యాయి. సీసీ కెమెరాల్లో పరిశీలించగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి షట్టర్ తెరిచి దుకాణంలో వున్న బంగారాన్ని అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

కలసపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించిన మారె శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. రెండు రోజుల క్రితం తన తల్లితో కలిసి వెళుతున్న ఆ విద్యార్థినిని శ్రీను తన బైక్‌లో ఎక్కించుకొని వెళ్తూ మార్గమధ్యలో అసభ్యకరంగా ప్రవర్తించాడని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

మైదుకూరులో 269 మందిపై కేసులు నమోదు

మైదుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు నెలల కాలంలో మద్యం తాగి మోటారు వాహనాలు నడుపుతున్న 107 మందిపై, అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన 167 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామని అర్బన్ సీఐ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువత మద్యం తాగడం వల్ల ప్రమాదాలకు గురి కావడమే గాక ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గండికోట నుంచి 2000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం మధ్యాహ్నం నుంచి 2000క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3400 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.76 టీఎంసీ ల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

అనుమతి తీసుకున్న గదుల్లోనే ల్యాబ్

● సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ల్యాబ్ సీజ్ : డీడీఎంహెచ్‌వో గీత



ల్యాబ్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న డాక్టర్లు అనుమతి తీసుకున్న గదుల్లోనే స్కానింగ్ మిషన్లను ఉంచాలని, ఇతర రూముల్లోకి మార్చకూడదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను శనివారం డీడీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ఈ ఆస్పత్రి నుండి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆర్ఎంపీ కేంద్రానికి స్కానింగ్ మిషన్‌ను తరలించారని ఆధారాలతో ఫిర్యాదు అందిందని, ఈ మేరకు తనిఖీలు నిర్వహించి ఓపీ ల్యాబ్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమతి తీసుకున్న చోటే ల్యాబ్ నిర్వహించాలని, అలాకాకుండా మార్పితే చట్టవ్యతిరేకం అవుతుందని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగనిర్ధారణ నేరమని, చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఈఎంవో భారతి, దేవాంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దౌలా, ఎన్‌సీడీ డాక్టర్ ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడులో ఉన్న తిరువణ్ణామలై (అరుణాచలం) గిరిప్రదక్షిణకు జిల్లా నుండి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కడప రీజియన్‌లోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుండి ఈనెల 4వ తేదీ మంగళవారం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక సోమవారాలలో, కార్తీక పౌర్ణమి రోజున తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అరుణాచలంతో పాటు ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, పొలతల, నిత్యపూజకోన, శివాలయాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అనువుగా ఉంటుందని, సీట్లు బుకింగ్ చేసుకుని అరుణాచల గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో పూర్తిచేయాలని కోరారు. కడప డిపో నుండి తిరువణ్ణామలైకు టికెట్ ధర రూ.1044, బద్వేలు డిపో నుండి రూ.1282, మైదుకూరు డిపో నుండి రూ.1209, ప్రొద్దుటూరు డిపో నుండి రూ.1273, పులివెందుల డిపో నుండి రూ.1193, జమ్మలమడుగు డిపో నుండి రూ.1363 టికెట్ ధర ఉంటుందని ఆయన తెలిపారు.


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అంకాళమ్మగూడూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

సింహాద్రిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో అక్టోబరు 31న రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో అండర్-14 విభాగంలో భానుకుమార్, సాఫ్ట్‌బాల్ పోటీలలో అండర్-17 విభాగంలో అరవిందనాథరెడ్డి ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈనెలలో చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎంపికైన విద్యార్థులను, పీడీ శిరీషను అభినందించారు.

కానగలకుంట నుంచి నీరు వెళ్లకుండా చర్యలు



ఎక్స్‌కవేటర్‌తో నీటి సంరక్షణ పనులు చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు బెంగళూరు రోడ్డులో వున్న కానగలకుంట నుంచి నికరజలాలు వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం ఎక్స్‌కవేటర్లను పెట్టి పనులు ప్రారంభించారు. పట్టణానికి ఎంతో కీలకమైన ఈ చెరువు అనేక వివాదాలకు కేంద్ర బిందువైంది. హంద్రీ-నీవా కాల్వ ద్వారా పలు చెరువులకు నీరు అందించడం లక్ష్యం కాగా ఇక్కడ కథ అడ్డం తిరిగి కానగలకుంట నీరు రివర్స్‌లో హంద్రీ-నీవా కాల్వలోకి చేరుతోంది. ఈ విషయమై పత్రికల్లో ప్రత్యేక కథనాలు వచ్చినా ఫలితం లేకపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు వచ్చినా నిల్వ వుండకుండా హంద్రీ-నీవా కాల్వలోకి వెళ్లిపోయా యి. దీంతో పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. స్పందించిన అధికారులు శనివారం యంత్రాలను పెట్టి తెగిన కాల్వగట్టును పూడ్చివేశారు. నీరు వృథాగా వ్యవసాయ భూముల్లోకి, కాల్వలోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొన్నారు.

వెంకయ్యకు ఉరుసు ఉత్సవాల ఆహ్వానం

కడప కల్చరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 5 నుండి 9వ తేదీ వరకూ జరుగనున్న పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును పెద్దదర్గా శిష్యులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులున్నారు.

హాస్టల్‌పై అధికారుల విచారణ



పులివెందుల ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులను విచారిస్తున్న ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి

పులివెందుల రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పులివెందులలోని గాయత్రినగర్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో జరిగిన ఉదంతంపై శనివారం జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో శనివారం రాత్రి ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి, ఇతర అధికారులతో కలిసి హాస్టల్‌లో జరుగుతున్న విషయాలపై విద్యార్థులను విచారించారు. హాస్టల్‌లో వార్డన్ సరిగా ఉండడం లేదని, మెనూ సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. కేర్ కేటింగ్ లేదని, ట్యూటర్ లేరని, ఉదయం పూట టిఫెన్ తినాలంటే ఇబ్బందిగా ఉంటోందని, శుభ్రంగా ఉండడం లేదని రాతపూర్వకంగా వివరించారు. మరుగుదొడ్లు సరిగా మెయింటెన్ చేయకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోందని, ఏదైనా ఆరోగ్యం బాగలేకపోయి వార్డన్‌ను అడిగితే దుర్భాషలాడుతారని, నైట్ వాచ్‌మెన్ ముని తమను ఆసుపత్రికి తీసుకెళ్తాడన్నారు. తమకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని విద్యార్థులు కోరారు. అనంతరం వంట ఎందుకు సరిగా చేయడం లేదని వంట మనిషిని ప్రశ్నించారు. సమయానికి వండి వడ్డించడానికి సరుకులు రావడం లేదని, సరుకులు లేకపోతే పిల్లలకు ఎలా రుచిగా వండిపెట్టగలనని వంటమనిషి తెలిపారు. అనంతరం వార్డన్ మోహన్‌ను విచారించి రాతపూర్వకంగా తీసుకున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి ఆంధ్రజ్యోతికి వివరించారు.

వ్యక్తిపై దాడి, కిడ్నాప్

● పలువురిపై కేసు నమోదు

పులివెందుల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డిపై పులివెందులకు చెందిన యల్లారెడ్డి, అతని అనుచరులు కిడ్నాప్ చేసి దాడి చేశారు. దీనిపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డి చెక్‌బౌన్స్ కేసులో శనివారం పులివెందుల కోర్టుకు వచ్చారు. అనంతరం కారులో తిరిగివెళ్తుండగా పులివెందుల శివార్లలో యల్లారెడ్డి, అతని అనుచరులు కారును ధ్వంసం చేసి అతడిని కిడ్నాప్ చేసి ఓ తోటలోకి తీసుకెళ్లి దాడి చేశారని ప్రియాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రియాంత్‌రెడ్డికి, యల్లారెడ్డికి గతంలో లావాదేవీలు ఉండేవి. ప్రియాంత్‌రెడ్డి డబ్బులు ఇవ్వకపోవడంతో యల్లారెడ్డి పులివెందుల కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశారు. గతంలో యల్లారెడ్డిపై హైదరాబాద్‌లో కేసు పెట్టించారని, దాని పర్యవసానంగా పులివెందులలో తన అనుచరులతో దాడి చేసినట్లు ప్రియాంత్‌రెడ్డి పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్షన్ల పంపిణీలో నిమ్మనపల్లికి మొదటి స్థానం

నిమ్మనపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో జిల్లాలో నిమ్మనపల్లికు మొదటి స్థానం దక్కిందని ఎంపీడీఓ రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం పెన్షన్లు 5049వుండగా 4831పెన్షన్లను అనగా 96శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు వారి గ్రామ పంచాయతీల్లో ఉదయం 7గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు. కాగా పెన్షన్లు తీసుకోని లబ్ధిదారులు వారు 3వతేదీ సచివాలయాల్లో తీసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లప్ప, కార్యదర్శులు నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

చినబాబుతో ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యోగభోగేశ్వరస్వామి దేవాలయం నూతన కమిటీ సభ్యులు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబును కలిశారు. నీరుగట్టువారిపల్లెలోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నూతన కమిటీకి చినబాబు శుభాకాంక్షలు తెలుపుతూ ఆలయాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని వారికి సూచించారు. చినబాబును కలిసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ కొప్పల వెంకటరమణ, సభ్యులు వరప్రసాద్, కె.ప్రకాష్‌నాయుడు, ఎస్.ఎల్.నరసింహులు, సి.మల్లిక, బి.శివకుమార్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, జె.సి.రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.



చినబాబును కలసి సన్మానిస్తున్న ఆలయ నూతన కమిటీసభ్యులు

ముదివేడు ఎస్ఐగా మధురామచంద్రుడు

కురబలకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్‌ను బదిలీ చేస్తూ ముదివేడు ఎస్ఐగా మధురామచంద్రుడును నియమిస్తూ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఎస్ఐ దిలీప్ కుమార్‌ను అనంతపురం రేంజ్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఆయనను అదే స్టేషన్‌లో కొనసాగించాలని మరోసారి ఉత్తర్వులు జారీ చేయడం, చివరగా శనివారం రాయచోటి డీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు మధురామచంద్రుడు బాధ్యతలు స్వీకరించారు.

16న మాల మహానాడు రాష్ట్ర మహాసభ

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో 16న నిర్వహించే మాల మహానాడు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమాల సుదర్శనం విజ్ఞప్తి చేశారు. మాలమహానాడు కార్యాలయంలో నేతలు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర అధికార ప్రతినిధి హరి, చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, జిల్లా అధ్యక్షుడు శివయ్య, మల్లెల మోహన్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వ ప్రాధాన్యత

● మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోల గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోల గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి అన్నారు. శనివారం 14 మున్సిపల్ వార్డుల్లో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ముందుచూపుతో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఇటీవల మొంథా తుఫాన్ భారి నుంచి ప్రజలను రక్షించారన్నారు.

ఖాతాదారుల సలహాలు, సూచనలు అవసరం



మాట్లాడుతున్న రీజినల్ హెడ్ ఎల్ఎస్‌వీఆర్ శర్మ

కలకడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల అభివృద్ధికి ఖాతాదారుల సలహాలు, సూచనలు అవసరమని యూబీఐ తిరుపతి రీజినల్ హెడ్ సోమంచి ఎల్ఎస్‌వీఆర్ శర్మ అన్నారు. కలకడ శాఖ రూ. 200 కోట్లు వ్యాపారం మైలురాయి అధిగమించిందన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి తమ సిబ్బంది ద్వారా మెరుగైన సేవలందిస్తామన్నారు. బ్రాంచి మేనేజర్ ప్రశాంత్‌బాబు మాట్లాడుతూ రైతులకు, స్వయం ఉపాధి సంఘాలు, వ్యాపారులకు రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంక్ అధికారులు టి.వేణుగోపాల్, కౌశిక్‌కుమార్, పాల్గొన్నారు.

వేడుకగా ఉత్థాన ఏకాదశి

● విశేష పూజలందుకుంటున్న గౌరీ కేదారేశ్వరులు

భక్తిశ్రద్ధలతో ఏకాదశి నోములు ● భక్తులతో పోటెత్తిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో పీలేరు కాశీ విశ్వేశ్వరుడు - శివాలయంలో నోములు నోస్తున్న మహిళలు - వాల్మీకిపురంలో విశేష పూజలందుకుంటున్న గౌరీ కేదారేశ్వర మూర్తులు

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహావిష్ణువు యోగ నిద్ర నుంచి నాలుగు నెలల తర్వాత కార్తీక శుక్ల ఏకాదశి రోజున మేల్కొంటారు. దీంతో చాతుర్మాసం ముగిసినట్లే. భక్తులు ఉపవాస దీక్షతో విష్ణుమూర్తిని పూజిస్తూ సాయంత్రం తులసి అమ్మవారి వివాహం చేస్తారు. శనివారం మండలంలో కేదారేశ్వర వ్రతం, ఏకాదశి నోములు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, రౌద్రాల అంకాలమ్మ, చెన్నకేశవ స్వామి, అగ్రహారంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచే మహిళలు పూజా సామగ్రితో ఆలయాలకు తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి ఆలయాల్లో నాగదేవతలు, రావి-వేప చెట్లకు నోము దారాలు చుట్టారు. కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు మహిళలతో కేదార, గౌరీ వ్రతాన్ని ఆచరింపజేశారు.

వైభవంగా వ్రతం

వాల్మీకిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో ఏకాదశి గౌరీ, కేదారేశ్వర నోములు, వ్రతాలు, ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో గౌరీ కేదారేశ్వర వ్రత వేడుకలు వైభవంగా జరిగాయి. విశేష సంఖ్యలో భక్తులు నోములు చేసుకున్నారు. వ్రత విశిష్టతను భక్తులకు తెలిపారు. అనంతరం ఆలయాల వద్ద తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గొనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో....

గుర్రంకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేదారేశ్వర నోములు మహిళలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మంజునాథస్వామి, సిద్దేశ్వరస్వామి, ప్యారంపల్లె కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఏకాదశి నోములు చేసుకున్నారు. అర్చకులు కేదారి వ్రత విశిష్టత భక్తులకు వివరించారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రామసముద్రంలో...

రామసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు నోములు నోచుకోవడంతో ఆలయాలు కిటకిట లాడాయి. బజారు వీధిలో వెలసిన వాళీశ్వరస్వామి, దిగువపేటలోని చంద్రశేఖరస్వామి, చెంబకూరు కాశీవిశ్వేశ్వరస్వామి, మూగవాడి పుండరీశ్వర, బలసముద్రంలో వాళీశ్వరస్వామి దేవాలయాల్లో శనివారం ఏకాదశి నోములు ఘనంగా నిర్వహించారు. శివపార్వతులను పుష్పాలతో అలంకరించి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయాల్లో అర్చకులు కేదారేశ్వర వ్రతం కథ క్లుప్తంగా భక్తులకు వివరించారు.



రామసముద్రం వాళీశ్వరస్వామి ఆలయంలో...

10వ తేదీలోపు లోపాలు సరిదిద్దుకోవాలి



బస్సుల భద్రతపై మాట్లాడుతున్న ఎంవీఐ విజయకుమారి

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీలోపు స్కూళ్ల బస్సుల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకోవాలని పీలేరు ఎంవీఐ విజయ కుమారి విద్యాసంస్థల యాజమాన్యానికి సూచించారు. స్కూల్ బస్సుల భద్రతపై శనివారం ఆమె తన కార్యాలయంలో ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు, వారి ప్రతినిధులకు అవగాహన కల్పించారు. బస్సు కండీషన్‌లో ఉండాలని, సాధారణ బ్రేకులు, హ్యాండ్ బ్రేక్, మంటలు ఆర్పే పరికరాలు, అత్యవసర ద్వారం, స్పీడ్ కంట్రోలర్, అలార్మింగ్ సిస్టమ్స్ కచ్చితంగా ఉండాలన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. బస్సుల భద్రతకు ప్రభుత్వం నిర్దేశించిన చెక్ లిస్టును 10వ తేదీలోపు వారికి అందజేయాలన్నారు. 10వ తేదీ తరువాత తాము ప్రతి బస్సును పరిశీలిస్తామన్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ రిలే దీక్షలకు సంఘీబావం తెలిపిన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుర్రంమిట్ట, కేవీపల్లెలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ రిలే దీక్షకు సంఘీబావం తెలిపిన ఆయన మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలన్నారు. పార్టీల కతీతంగా అందరూ సంఘీబావం తెలిపి రెవెన్యూ డివిజన్ సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ నేతలు ముల్లంగి చంద్రయ్య, పీ. శ్రీనివాసులు, ధరణీకుమార్, సుంకర చక్రధర్, అమృత్ తేజ, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీరంగిలో బ్రహ్మంగారి జయంత్యుత్సవాలు

బి.కొత్తకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీరంగి గ్రామంలో నేడు పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలు, చెక్కలకోలాటం, రాత్రికి రామభజన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తాదులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్న సంతర్పణ నిర్వహించనున్నట్టు గ్రామానికి చెందిన మేకల వెంకటేశు తెలిపారు.

మాల మహానాడు అధ్యక్షుడిగా గుండా సతీష్

కలికిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు అధ్యక్షుడిగా గుండా సతీష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీడీ హరి ఆధ్వర్యంలో శనివారం అధ్యక్ష ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం ఎన్నిక నిర్వహించి నియమాక పత్రాన్ని సతీష్‌కు అందజేశారు. ఎస్వీడీ హరి, జిల్లా అధ్యక్షుడు శివ, ఎన్వీ రమణ, పుంగనూరు అశోక్, చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, వీరభద్ర, విజయ్, విశ్వనాథ్, అంకన్న పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

● టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు



ములకలచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న యువనేత కట్టా దొరస్వామినాయుడు, పాలగిరి సిద్దా

ములకలచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా అన్నారు. స్థానిక ఇందిరా కాలనీలో శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతి నెలా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. ఎంపీడీఓ హరినారాయణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు తోట గిరిధర్, నాగరాజు యాదవ్, సోమశేఖర్, శివన్న, ఇమాంబాషా, నాగేంద్ర, రెడ్డెప్ప, సుధాకర్ నాయుడు, చాంద్‌బాషా, గొడ్డుమూరు రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆదరువు పింఛన్లు



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష, కమిషనర్ ప్రమీల

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆదరువుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఉద్ధరిని గిన్నె వితరణ

గుర్రంకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారికి దాతలు తీర్థం ఉద్ధరిణ గిన్నెను వితరణగా ఇచ్చారు. తిరుపతి వాసి, విశ్రాంత టీటీడీ సూపరింటెండెంట్ రెడ్డెన్న కుటుంబ సభ్యులు తీర్థం ఉద్ధరిని గిన్నెను చైర్మన్ రాజన్న నాయుడుకి అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్రం



జంగంపల్లె హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రావతరణ దినోత్సవం

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టిశ్రీరాములు ఆమరణ దీక్ష చేశారన్నారు. ఈ దీక్షలో ఆయన మృతి తరువాత అప్పటి కేంద్రప్రభుత్వం తెలుగు రాష్ట్రాన్ని ప్రకటించారన్నారు. అధ్యాపకులు ఖాజావలి, మోహనవల్లి, వెంకటశివ, మోహన్ బాబు, సుబ్బరాయుడు, గురుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరజీవికి అవోపా ఘన నివాళి

పీలేరు/పీలేరు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్య వైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాచపల్లె శ్రీనివాసులు పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. స్థానిక సంత ప్రాంగణంలో ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. పలువురు ఆర్యవైశ్య సంఘ, అవోపా సభ్యులు పాల్గొన్నారు.

జంగంపల్లె జడ్పీహైస్కూల్‌లో రాష్ట్రావతరణ దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం తాటిపర్తి గంగాధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19 నుంచి డిసెంబరు 15 వరకూ ఆమరణ దీక్ష చేసి అమరుడయ్యారన్నారు. అనంతరం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని చెప్పారు. దేశంలో మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఆవిరవించిందన్నారు. ఉపాధ్యాయులు ఆర్, ఆనంద రాజు, లక్ష్మీదేవి, రామమూర్తి, అశోక్‌కుమార్, ఫారూక్, సురేంద్రనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.